# 26. గుర్రం పత్రికలూ - గాడిద పత్రికలూ

"మనం ఓ పత్రిక పెట్టాలి!" అన్నాడు అప్పారావు ఓ ఆదివారం ప్రొద్దున్నే వచ్చి కూర్చుని.

"ఏం నీ కిరసనాయిల్ బిజినెస్ బాగా నడవటంలేదా?" అనడిగాను. మా వాడు అందులో హోల్ సేల్ డీలర్. కరువు కాలంలో ఓ బంగళానూ, స్కూటర్ నూ ప్రసాదించి పెట్టిన కామధేనువులాంటి వ్యాపారమది.

"నీ జోకులు కట్టిపెట్టు! జీవితం ఇంత చండాలంగా ఇంకెప్పుడన్నా వున్నదా? మనంచూస్తూ కూర్చోవలసిందేనా?" అన్నాడు అప్పారావు.

చూస్తూ కూర్చోవటం దేనికి, ఆ ఛండాలాన్ని నీ కిరసనాయిల్తో శుభ్రంగా ఉతికి ఆరెయ్!" అన్నాన్నేను.

"అందుకే పత్రిక పెడదామంటున్నాను!"

"అయితే, ప్రజా జీవిత మురికిని మన పత్రికా చాకలి చేత ఉతికిద్దామంటావు! అంతేనా?"

కాదనుకో! కానీ, ఉతుక్కోవటం ఎలాగో మన పత్రిక ద్వారా ప్రబోధించొచ్చుగా! అది మాత్రం ప్రజాసేవగాదా!"

"మన్లోమాట! నీకు ఎమ్మెల్యే అవ్వాలనే ఆశ కానీ పుట్ట లేదుగదా!"

"మరీ అంత అన్యాయంగా మాట్లాడకు! నేనేం రాజకీయ వారపత్రిక పెడదా మనుకోవటంలేదు. ఏదో ప్రజలకు కాస్త ప్రభోధాత్మకంగా ఉండే రచనల్తో ఓ సచిత్ర పత్రిక తెద్దామనుకుంటున్నాను. నీవుకూడా ఖాళీగానే ఉన్నావు గదా! ఓ ప్లాను తయారుచెయ్!" అన్నాడు అప్పారావు.

"సరే! ముందు నా ఫీజు క్రింద ప్రస్తుతానికి కిరసనాయిలు అక్కర్లేదుగానీ, ఓ నూటపదహార్లిలా పారేయ్! ఆ మాత్రం పెట్టుబడిలేనివాడు పత్రిక నాలుగో సంచికను తీయగలుగుతాడంటే నేన్నమ్మను." అని పట్టుబట్టేన్నేను.

ఏమనుకున్నాడోగానీ పర్సుతీసి ఒ పచ్చకాగితం టేబుల్ మీదుంచాడు అప్పారావు.

వీడేం కాలక్షేపానికి కబుర్లుకొట్టడంలేదని నాకప్పుడు నమ్మకం కలిగింది.

"అయితే మన పత్రిక పాలసీ ఏమిటి? లక్ష్యాలేమిటి? ఇది తెలితేగానీ మనది గుర్రంగా ఉండేదీ, గాడిదలా ఉండేదీ తేల్చటం కుదరదు" అన్నాన్నేను.

"గుర్రం పత్రికలకీ, గాడిద పత్రికలకి తేడా ఏమిటి? అసలది ఎలా వస్తుంది?" అని గద్దించాడు వాడు.

"గుర్రం పత్రికలకు ప్రసిద్ధి జాస్తి, అమ్మకాలెక్కువ. పేవ్‌మెంటు దుకాణాల్లో తోరణాలుగా వేలాడుతూ రంగుల్లో మెరిసిపోతూంటాయ్ చూశావా, అవి గుర్రం పత్రికలు! పంచ కళ్యాణిలా అవి వెలిగిపోతూంటాయ్ వాటికి ఏ చీకూ చింతా లేదు, కాస్త పచ్చగడ్డిని కడుపులో నింపుకుని ప్రజల మధ్యకు షికారు వస్తూంటాయ్. ఇహ గాడిద పత్రికలంటావ్! వాటికి కొన్ని ఆదర్శాలంటూ తగలడుతాయి. ఇందాక అనుకున్నామే! ఆ బాపతు ప్రజాజీవన మురికిని ఉతికి ఇస్త్రీ చేయటమే తమ లక్ష్యం అంటాయి అవి. కనుక ఆ మురికి మూటల మోత ఈ పత్రికా గాడిదలకు తప్పదు. మరి నువ్వు గాడిద ఓనర్‌వి కాదలచావా? లేక గుర్రం ఓనరివి కాదలచావా? ముందు అది తేల్చు!" అన్నాన్నేను.

"ఏదయితే బాగుంటుందంటావు?"

"గుర్రం పత్రికల్ని కొని చదివేవాళ్ళెక్కువ. గాడిద పత్రికల్ని పొగిడే వాళ్ళెక్కువ. ఫ్రీగా ఇచ్చినా చదివేవాళ్ళు తక్కువ."

"ఎడిటర్‌వి నువ్వేగదా! నువ్వే తేల్చు. గుర్రాన్నెక్కుదామో, గాడిద నెక్కుదామో. నామట్టుకు నాకు నేను పెట్టే డబ్బు తిరిగి వస్తూంటే చాలు."

"ప్రజాసేవ అన్నతర్వాత సీ పెట్టుబడి మళ్ళీ నీ జేబులోకే భద్రంగా తిరిగి రావాలంటే కుదరదు."

"అయితే మనం యువ రచయితలను, కళాకారుల్ని పైకి తీసుకురావటం పాలసీగా పెట్టుకుందాం. వాళ్ళ రచనలకు హెచ్చు ప్రాధాన్యత నిద్దాం!"

"అవునవును! అలాగయితే చాలా ఖర్చులు కలిసొస్తాయి. వాళ్ళకు రెమ్యూనరేషన్లేగాదు, కాంప్లిమెంటరీ కాపీలు పంపకున్నా కోపగించుకోరు!"

"అబ్బె! నా ఉద్దేశ్యం అదిగాదు. మనం పేరున్న రచయితలవీ వేసుకోవాల్సిందే. సీరియల్ శ్రీ నవల ఒకటి మన పత్రికలో తప్పనిసరిగా వుండాల్సిందే! అలాగే కార్టూన్లూ, జోకులూ కూడా వేద్దాం!''

"ఏదివేసినా మనపత్రికే ఒక జోక్ కాకుండా ఉండటం ముఖ్యం. సీరియల్ శ్రీల నవలలకూ, కుర్ర శ్రీల కథలకూ లంకె కుదరాలంటే కష్టం. అవి నచ్చనివాళ్లూ, ఇవి నచ్చనివాళ్లూ కలసి అసలు పత్రిక జోలికిరావటం మానేస్తే మన పత్రిక్కి మనమే రీడర్లంగా మిగిలిపోతాం!"

"ఆ ప్రమాదం రాకుండా చూసేందుక్కాకపోతే నువ్వెందుకు ఎడిటర్ గా। జీతం దండుగ।''

''అన్నట్లు నాకేమాత్రం జీతం ఇస్తావు"?

''ఓ ఆర్నెల్లపాటు నీవు జీతం సంగతి ఎత్తగూడదు ! ఇది మన పత్రిక ! ప్రజాసేవ ఫలించాక నీ జీతం సంగతి ఆలోచిద్దాం। ఈలోగా నీక్కావాల్సినప్పుడల్లా ఓ డబ్బా కిర్సనాయిల్ ఫ్రీగా పట్టుకుపో!"

"రచయితలకూ్కడా అంతేనా? కథకెన్ని లీటర్లిద్దా మంటావు ?"

"కుర్రశ్రీలకు ప్రస్తుతానికి ఏమీలేదు! సీరియల్ శ్రీలకు తప్పదుగనుక ఏదోఇచ్చేద్దాం. అన్నట్టు వాళ్ళు కిరసనాయిల్ పుచ్చుకుంటారా ?"

"ఏమో ఫారిన్, లిక్కర్ పుచ్చుకుంటారేమో"

"అవి సప్లయ్ చేయాలంటే నా బంగ్లా అమ్ముకోవా ల్సిందే! పోనీ, మా పేట లైబ్రరీలో పాత పత్రికల బైండ్లు చాలా ఉన్నాయ్! వాటిల్లో మంచి సరుకుంటుంది!"

"ఏమిటి ? ఫారిన్ లిక్కరా ?"

"జోకులెయ్యకు! ఈ తరంవాళ్ళు చదవని మంచి కథలు వాటిల్లో చాలా ఉంటాయ్! వాటితో మన పత్రికను నింపేస్తే ?"

"అద్భుతం, నీ అయిడియా! పైగా రెమ్యూనరేషన్ల బెడదకూడా తప్పుతుంది"

"మన నూరు పేజీల్లో సగం ఈ పాత కథాఖండాల్తో నింపేద్దాం, మరో పాతిక పేజీలు కుర్రశ్రీ, సీరియల్ శ్రీల కథాకండలతో నింపుదాం. మరి మిగిలిన పాతిక పేజీల్లో...?"

"మనం పత్రిక పెట్టేది ప్రజాసేవకోసం గదా! ఆ పాతిక

పేజీల్లో అప్పారావు దుకాణంలో కిర్సనాయిల్ ఎందుకు దొరకటం లేదు? లాంటి పరిశోధనా రచనలు వేద్దాం!''

"ఏడ్చినట్టుంది!''

"భయపడకు! ఆ వ్యాసం నేనే రాస్తానుగా! నీ మీద ఈగ వాలనివ్వను. మీ కంపెనీ వాళ్ళు నీకు కోటా ప్రకారం సప్లయిచేయక పోవటమే కొరతకు కారణం అని దబాయిద్దాం!''

'బాగానే ఉందిగానీ, కంపెనీవాళ్ళు మన పత్రికకి ప్రతి నెలా ఓ అడ్వర్టయిజుమెంటిస్తామని ప్రామిస్ చేశారు! మరి నువ్విలా రాస్తే ఆ ఛాన్స్ ఎగిరిపోగా నా డీలర్ షిప్ కూడా...!'

''అదీ పాయింటే! అయితే ఈ కొరతకు కారణం వాళ్ళూ కాదు, నీవూ కాదు, రైల్వేవాళ్ళు వాగన్స్ సరిగ్గా సప్లయి చేయకపోవటమే కారణం! కనుక ఈ దుర్మార్గ ప్రభుత్వం నశించాలి! ఈ బూరువా రైల్వేలను అప్పారావు గారి కిర్సనాయిల్లో తగలెట్టాలి' అని ఓ ఘాటు ఘాటు వ్యాసం రాసి ప్రజాసేవ చేద్దాం.'

'ఆ రైల్వే ఆఫీసరు నాక్లోజ్ ఫ్రెండు. వాడు నాక్కావాల్సినన్ని వాగన్లు ఇస్తూనే వున్నాడు, అదీగాక మన పత్రికకి 'రైల్వేలు ప్రజల ఆస్తి' అంటూ ప్రతినెలా జ్ఞాపకం చేస్తూ ఓ అడర్టయిజుమెంటు కూడా ఇప్పిస్తానన్నాడే!'

'అయితే రైల్వేవాళ్ళను కూడా పతివ్రతల జాబితాలో చేర్చేయాల్సిందే! పోనీ, కిరసనాయిల్ కొరతకు కారణం రైల్వేనుండి నీ గోడౌన్‌కు సకాలంలో రవాణాచెయ్యని మీ లారీ కంట్రాక్టర్సేనని రాసేద్దాం!'

'అదెలా కుదురుతుంది. ఆ లారీ కంపెనీ మా బామ్మర్ది దగ్గర బంధువుది. వాళ్ళు ప్రతినెలా మన పత్రిక్కి 'ప్రగతి పథంలో మా లారీలు' అంటూ ఓ అడ్వర్టయిజుమెంటిస్తామని ప్రామిస్ చేశారు కూడా'

'అయితే మనం ప్రజాసేవ చేయటం కష్టమే. పోనీ, సినిమాల్నే పత్రికా తిట్టటం లేదుగదా! మన పాఠకులకి తిట్టు కవిత్వం చాలా ఇష్టం. ఆ పాతిక పేజీలూ తాజా సినిమాల్ని తిడుతూ హాట్‌హాట్‌గా రాసిపారేద్దాం.'

"అదేం కుదరదు. అలాగయితే నా బంగ్లానే కాక నా స్కూటర్ని కూడా అమ్ముకోవాల్సిందే. సినిమావాళ్ళంతా నాకు తెలిసినవాళ్ళే. వాళ్ళ అడ్వర్టయిమెంట్లు లేకుండా మన పత్రిక బ్రతుకుతుందనేనా నీ ఉద్దేశ్యం !"

'ప్రజాసేవ చాలా కష్టంలా కనపడుతోందే! ఇంత ఖర్చు ఎందుకొ్కనీ, బజార్లో ఓ గుర్రం పత్రిక తెచ్చి అదెలా ఉంటే అలా తయారుచేద్దాం మన పత్రికని. సినిమావాళ్ళు అలాగే చేస్తుంటారు."

"బాగుంది, నీ అయిడియా. ఇదిగో ఈ పదహార్లు కూడా ఉంచుకో! మంచి సలహా ఇచ్చావ్ ।" అంటూ లేచాడు అప్పారావు.

'మరి నా జీతం సంగతి ఏంచేశావ్ ?'

"ఏమనుకోకు, ఈమాత్రానికి ఓ ఎడిటరూ, వాడికి జీతమూకూడా ఎందుకు దండుగ । ఆ మాత్రం మా అమ్మాయి చూసుకోగలదు. బియ్యే పాసయి ఊరికే కూర్చుంది. పత్రికలూ గట్రా బాగా చదువుతూంటుందిలే. ఆ పైన నువ్వున్నావుగా సలహాలిచ్చేందుకు నీ రుణం ఉంచుకోనులే. అవసరం వచ్చినప్పుడల్లా కంట్రోల్ రేటుకు కిర్సనాయిల్ ఇస్తూంటానుగా."

(నవంబర్ 1973)